# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం 24 డిసెంబర్ 2024 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 12


## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి



2







# అడవి ఆముదం కాయలు తిని అస్వస్థత

- వాంతులు, విరోచనాలు చేసుకున్న ఎనిమిది మంది విద్యార్థులు
- పోలంపల్లి ప్రైమరీ స్కూల్‌లో ఘటన
- విద్యార్థులను ఆస్పత్రికి తరలింపు

**మహాముత్తారం, డిసెంబర్ 23(నినాదం న్యూస్):** ప్రభుత్వ పాఠశాల సమీపంలోని అడవి ఆముదం కాయలను తిన్న ఎనిమిది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం పోలంపల్లి ప్రైమరీ స్కూల్‌లో చోటు చేసుకుంది. పాఠశాలలో చదువుకుంటున్న వినయశ్రీ, రుత్విక్, వర్షన్, వైష్ణవి, హర్ష, హర్షిత, మహంతి, శ్రీ వైష్ణవి అనే విద్యార్థులు పాఠశాల ప్రహరీ పక్కనే ఉన్న అడవి అముదం కాయలను తినగా కొద్ది సేపటి తర్వాత ఒక్కసారిగా వాంతులు, విరోచనాలకు గురి కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు అప్రమత్తమయ్యారు. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి 108సహాయంతో జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, ఎంఈఓ సంజీవరెడ్డిలు పరామర్శించి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. అయితే విద్యార్థులకు మిగతా2లో

## అమిత్ షా రాజీనామా చేయాలి


### కొలను హనుమంత రెడ్డి



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్ సమావేశాల సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్‌ను కించపరిచేలా దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన అమిత్ షా చేసిన వ్యాఖ్యలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించబోదన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మతోన్మాద మంత్రికి మంచి బుద్ధి ప్రసాదించాలని వారు మిగతా2లో

# విద్యుదాఘాతంతో రైతు మృతి

**కొల్చారం, డిసెంబర్ 23:(నినాదం న్యూస్):** మండల పరిధిలోని సంగాయిపేట గ్రామ శివారులో గల వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై రైతు మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుని బంధువుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ముక్కిరే మల్లయ్య(60) నారుమడికి నీరు పెడదామని పొలం వద్దకు వెళ్లి చూడగా స్టార్టర్ లో ఒక ఫేస్ కరెంటు రావడంలేదని గమనించాడు. ఏమైందోనని ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా ఫీజు వైరు కట్ అయి ఉండడానికి చూసి, ఫీజు వైరు అమర్చడానికి ఏపీ స్విచ్ బంపర్ ఆఫ్ చేయబోయే క్రమంలో అదుపుతప్పి ట్రాన్స్ఫార్మర్పై పడిపోయాడు. దీంతో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ గౌస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య సత్యమ్మ, కుమారుడు నరసింహులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.







# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

**కొల్చారం, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో బిఆర్ఎస్ యువత విభాగం అధ్యక్షుడు తణుకులపల్లి సంతోష్ రావు ఆధ్వర్యంలో వాలీబాల్ ప్రీమియర్ లీగ్ -1 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి గ్రామంలో ఇలాంటి పోటీలు నిర్వహించడం తనకెంతో సంతోషాన్నిస్తుందన్నారు. యువకులకు విద్యతోపాటు క్రీడలు కూడా అత్యంత ఆవశ్యకమని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంలో దోహదపడతాయని, దేహదారుఢ్యం మానసిక ప్రశాంతత మొదలగునవి క్రీడల వలన పెరుగుతాయన్నారు. క్రీడలు యువకులు చెడుదారి పట్టకుండా వారిలో సృజనాత్మకతను పెంపొందించుకునే విధంగా , తమపై తమకు ఆత్మస్థైర్యం పెంపొందించడంలో ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నందువల్ల యువత క్రీడకు దూరమవుతుందని, యువకులను చైతన్య పరచడమే తన ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.అనంతరం వి న్నర్ జట్టు అయిన వేణు కు విన్నర్ కప్పుతో పాటు 10,000 రూపాయల ప్రైజ్ మనీని అందజేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, కొమ్ములయాదగౌడ్, ముత్యం గారి సంతోష్ ,గౌరీ శంకర్, సిద్ధిరములు, రవితేజ, రవీందర్, చిట్యాల యాదయ్య, బైకారి శ్రీకాంత్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# అడవి ఆముదం కాయలు తిని అస్వస్థత





(మొదటిపేజీ తరువాయి..)

ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. సకాలంలో విద్యార్థులను ఆస్పత్రికి తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సకాలంలో మూడు 108 వాహనాల ద్వారా ఆసుపత్రికి తరలించిన పిఎమ్టీలు స్వామి, సుధాకర్, సుజాత, మల్లారెడ్డి, సదానందం, చంద్రయ్యలను అధికారులు అభినందించారు.

# అమిత్ షా రాజీనామా చేయాలి

(మొదటిపేజీ తరువాయి..)

ఎద్దేవా చేశారు. దేశానికి దిశా నిర్దేశం చేసిన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పి తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు డా.అవిజె జేమ్స్, డీసీసీ ఉపాధ్యక్షులు దమ్ముని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, గడ్డం రాజేందర్ రెడ్డి, కోలన్ రాజశేఖర్ రెడ్డి, 129 డివిజన్ మాజీ కార్పొరేటర్ పాల క్రిష్ణ, బహదురుపల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్, సోమన్నగారి



శ్రీధర్ రెడ్డి, గణేష్, పండరి రావు, ఎండి లాయక్, సంతోష్ ముదిరాజ్, ఇరుగు రాధాక్రిష్ణ ,జెస్సీ పల్, ప్రేమ్ సాగర్, శ్రీశైలం యాదవ్, పుల్లెం రాజు, సంపంగి వెంకటేష్, షఫీ, భాస్కర్ రెడ్డి, రాజు చారి, పద్మ రావు, శ్రీనివాస్ గుప్తా, సురేందర్ రెడ్డి, అజయ్, గఫ్ఫార్, రవీందర్ నాయక్, అజిమ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్న పట్టించుకోరా...?





- **గాజులరామారం సర్కిల్ మున్సిపల్ కార్యాలయం ముందు భగత్‌సింగ్ నగర్ వాసుల ధర్నా**

**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 128 - చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ లోని దోబీ ఘాట్ వద్ద గల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు కబ్జా చేస్తుండగా, అధికారులు మాత్రం ఆ నిర్మాణాల వైపు కన్నెత్తి చూడకపోవడంపై భగత్ సింగ్ నగర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సోమవారం కుత్బుల్లాపూర్ లోని గాజులరామారం సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ నగర్ లోని దోభిఘాట్ వద్ద గట కొన్ని రోజులుగా కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తూ దాదాపు 16 రూములను నిర్మించి ఫ్లాట్ కి 50 లక్షల చొప్పున వసూలుచేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారు. ఈ కబ్జా విషయంపై కుత్బుల్లాపూర్ తాసిల్దార్, మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వ అధికారులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో విసిగిపోయి నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానికులు పాల్గొన్నారు.

# సబితా ఇంద్రారెడ్డితోనే అభివృద్ధి సాధ్యం

**మహేశ్వరం, డిసెంబర్ 23 (నినాదం న్యూస్)** మహేశ్వరం తుమ్మలూరులో స్కూలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన సబితా ఇంద్రారెడ్డి విద్యార్థిని విద్యార్థులకు అందిస్తున్న మద్యాన్న బోజనాలను పరిశీలించారు,ఈరోజు భోజనంలో కేవలం గుడ్డు,సాంబారుతో సరిపెట్టారు"కర్రీ అందించలేదు".అంగన్వాడీ కేంద్రంలో పిల్లకు అందించే భోజనంలో గుడ్డు ఇవ్వకపోవడాన్ని గమనించి సబితా ఇంద్రారెడ్డి నిర్వాహకులను నిలదీయగా మాకు గవర్నమెంట్ ద్వారా సప్లై లేకపోవడంతో గత 15 రోజులుగా గుడ్డు అందించడం లేదని చెప్పారు."మేనులో ఉన్న పదార్థాలు అందించడం లేదు"అని అడగగా బిల్లులు సకాలంలో అందడం లేదని అన్నారు..కాంగ్రెస్ ప్రభుత్వానికి గొప్పలు



చెప్పుకోవడంలో ఉన్న శ్రద్ధ హామీలు నెరవేర్చడంలో లేదని ఎద్దేవా చెందారు, మధ్యన భోజన నిర్వాహకులకు సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తెస్తే అసంబ్లీలో కొట్లాడతామని మాజీ మంత్రి వర్యులు మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు శ్రీమతి పి.సబితా ఇంద్రారెడ్డి ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నక్షత్ర హెూటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి







- నాణ్యతలేని ఆహారాన్ని విక్రయిస్తూ, కస్టమర్లపై దాడికి పాల్పడ్డ రెస్టారెంట్‌ను సీజ్ చేయాలి
- జిల్లా కలెక్టర్‌కు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, 23 (నినాదం న్యూస్)** బిర్యానిలో స్క్రబార్ ఇనుప చువ్వలు వచ్చాయని యాజమాన్యానికి తెలిపిన కస్టమర్లపై దాడి చేసిన నక్షత్ర యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని చేవెళ్ల మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన మహేందర్ శంకర్ నాగరాజు సురేష్ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. బాధితులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదులో ఏవిధంగా పేర్కొన్నారు.తేదీ 22 ఆదివారం రోజున మధ్యాహ్నం సమయంలో దాదాపు 2: 30 గంటల నిమిషాల సమయంలో కండ్లపల్లి రెవెన్యూ చిట్టెంపల్లి గేటు ఉన్న నక్షత్ర రెస్టారెంట్ కు బిర్యానీ తినడానికి వెళ్ళాము. అనంతరం బిర్యాని తీసుకొని తింటుండగా అందులో డిష్ లు తోమే స్క్రబ్బర్ ఇనుప చూవ్వలు బిర్యానీలో రావడంతో, వీటి విషయంపై మేము నక్షత్ర రెస్టారెంట్ యజమానియాని, మాణిక్యరావు అలియాస్ మేషక్, కు ఫిర్యాదు చేసాము. కస్టమర్లు ఉన్న సమయంలో మీరు గొడవ చేయకండి మీకు వేరే బిర్యాని పెట్టిస్తాము అని చెప్పారు. అంటే మేము మాకు బిర్యాని అవసరం లేదు, బిర్యానీలో ఇనుప చూవ్వలు రాళ్లు చెత్తాచెదారం నాణ్యత లేని భోజనం పెట్టడం కరెక్ట్ కాదని, ఇదివరకు ఎన్నోసార్లు కూడా వచ్చాయని అడిగాము. మేము డబ్బులు ఇస్తున్నాం కదా మంచి బిర్యానీ ఇవ్వండి అని అడిగాము. అప్పుడు వారు మాపై దురుసుగా మాట్లాడుతూ అరే మీరు బిర్యాని తినే ముఖమే నారా మీది, అంటూ, యజమాని ఉప్పరి మాణిక్య రావు అలియాస్, మేషక్, పనిచేసే సిబ్బంది దాదాపు పది నుంచి 15 మంది మూకుమ్మడిగా మాపై దాడి చేశారు. మేము భయభ్రాంతులకు గురై పరిగెత్తి రోడ్డు దాటి వెళ్లిపోయాము. అయినా వారు మమ్మల్ని వెంబడించి పట్టుకొని కొట్టుకుంటూ రెస్టారెంట్ వద్దకు తీసుకొచ్చి, పనిచేసే సిబ్బంది గరిటెలతో ఇరుప రాడ్లతో కేబుల్ వైర్లతో కర్రలతో దాడి చేశారు. నక్షత్ర రెస్టారెంట్ యజమాని వాళ్ల భార్య అయినా సుమతమ్మ చెప్పులతో దాడికి దిగింది. అక్రమ దాడులకు పాల్పడుతూ రెస్టారెంట్ నాసిరకం భోజనం పెడుతూ, కస్టమర్లకుపై దులుసుగా ప్రవర్తిస్తూ దాడులకు దిగుతున్న నక్షత్ర రెస్టారెంట్ పైన చర్యలు తీసుకుని, రెస్టారెంట్లు సీజ్ చేయగలరని, దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఘనంగా శాంతి విద్యానికేతన్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు







**ఆళ్లపల్లి, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** ఏసుక్రీస్తు అంటే జాలీ దయ ప్రేమ కరుణకు ప్రతిరూపమని స్థానిక ప్రభుత్వ వైద్యులు సంఘమిత్ర అన్నారు. ఈ సందర్భంగా సోమవారం శాంతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల హెచ్ఎం, సిస్టర్ మహిత అధ్యక్షతన సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రెవరెండ్ ఫాదర్ కూరపాటి యాకోబు, ప్రభుత్వ వైద్యురాలు సంఘమిత్ర హాజరయ్యారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు నృత్యాలతో పాటుగా పాటలను కథలను నాటికలను నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులందరితో పాటుగా సిబ్బందికి సైతం ప్రభుత్వ వైద్యురాలు సంఘమిత్ర తమ సొంత ఖర్చులతో విలువైన బహుమతులను అందజేశారు. అనంతరం ఫాదర్ యాకోబు, వైద్యులు సంఘమిత్రలు మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు ప్రేమ జాలి కరుణ ప్రతిరూపానికి క్రీస్తు ప్రతిబింబమని, ఇతరుల పట్ల ప్రేమ ఆప్యాయతలను చూపాలని, నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించాలని, శాంతియుత మార్గంలో పయనించాలని ఏసు క్రీస్తు బోధనలను వారు ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది డిఎస్ఎస్ సుపీరియర్ సిస్టర్ మేరీ శాంతాల్, దామరీస్, షేమీ సత్యం, జ్యోతి, సహన, శిరోమణి, కవిత, సింధు, మెడికల్ సిబ్బంది ఫార్మసిస్ట్ మురళి, ల్యాబ్ టెక్నీషియన్ పార్వతి, డివో నాగేశ్వరరావు,108 సిబ్బంది సునీల్, భాగ్య, ఆయా లక్ష్మి, జ్యోతిర్మయి యానిమేటర్ పరమ ప్రభాకర్, గ్రామీణ వైద్యులు మహమ్మద్ నయూమ్, సందీప్, చంద్రకళ, తల్లిదండ్రులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



## సావిత్రమ్మ వృద్ధాశ్రమంలో అన్నదానం

**ఆళ్లపల్లి, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** మండల పరిధిలోని మర్కోడు గ్రామానికి చెందిన ఈశ్వరోజు సద్గుణాచారి, కృష్ణకుమారి దంపతుల కుమార్తె కల్పితా శ్రీ పుట్టినరోజు సందర్భంగా కొత్తగూడెం బూడిదిగడ్డ సావిత్రమ్మ వృద్ధాశ్రమంలో పిల్లలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. మండల ప్రజలకు మధ్య అధికారులకు వారధిగా పనిచేస్తున్న ఆళ్లపల్లి మండల ప్రజాజ్యోతి రిపోర్టర్ సద్గుణచారి కుమార్తె పుట్టినరోజు సందర్భంగా సోమవారం అన్నదానం చేయడం శుభ పరిమాణం అని పలువురు అభినందించారు.

## వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత



**ఆళ్లపల్లి, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో డిసెంబర్ 9న నిర్వహించిన అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం అఖిలభారత పూర్వ కమిషనర్ బాబా హర దేవ్ సింగ్ విచార్ మంచ్ మండల అధ్యక్షులు వగలబోయిన సతీష్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి అశ్విని, ద్వితీయ చరణ్య, తృతీయ మౌనిక కు షీల్డ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, ఉపాధ్యాయులు బానోత్ వీరన్న, బాలాజీ, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**ఆళ్లపల్లి, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** మండల పరిధిలోని మైలారం జిపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, రామయ్య ఎన్నో ఏళ్ళుగా సుదీర్ఘంగా ఉపాధ్యాయ వృత్తి చేపడుతూ ఎటువంటి అంతరాయాలు లేకుండా ఎంతోమంది గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించి వారిద్దరూ మరొక పాఠశాలకు బదిలీపై వెళ్లినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగా రాంబాబు ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఎంఈఓ కొమరం శాంతారావు, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్ఎం భద్రమ్మ, ఎస్.సీ.ఆర్.పి. నెహ్రూ, ఉపాధ్యాయులు తాటి బిక్షమయ్య, జి.కుమార్ రాజా, టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి హతిరామ్, అంగన్వాడీ కార్యకర్త ఈసం బాయమ్మ, మధ్యాహ్న భోజనం వర్కర్ జోగ సావిత్రి పాల్గొన్నారు.



## ముల్కనూర్‌లో పివి 20వ వర్ధంతి

**భీమదేవరపల్లి, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 20 వర్ధంతి కార్యక్రమం సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులో నిర్వహించారు. కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో పివి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. అంచెలంచెలుగా ఎదిగి దేశ ప్రధానిగా సేవలు అందించిన పివి ఈ ప్రాంత వాసి కావడం గర్వకారణం అన్నారు. ఆయన తీసుకు వచ్చిన ఆర్థిక సంస్కరణ వల్ల నే నేడు దేశం సాధిస్తున్న ఆర్థిక ప్రగతి కి నిదర్శనం అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టంపల్లి ఐలయ్య, ప్రకాశ్, చంద్రశేఖర్, స్వరూప,గోపాల్ రావు కరుణాకర్, రమేష్, అనిల్ పివి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకొండ జాతర ఏర్పాట్లపై నేడు అధికారుల సమీక్ష



**భీమదేవరపల్లి, డిసెంబరు 23 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయం లో ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదిన సందర్భంగా జరిగే జాతర ఈ సంవత్సరం కూడా బ్రహ్మోత్సవాలు జనవరి 10 న స్వామివారి కళ్యాణంతో మొదలు కానున్నారు. జాతర ఉత్సవాలు విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులతో నేడు సమావేశం నిర్వహిస్తున్నారు. జిల్లా పోలీసు అధికారులు, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ రాజ్, నీటి సరఫరా, వైద్య, రోడ్డు భవనాలు, అగ్నిమాపక, ఆర్టీసీ, ఆబ్కారీ శాఖ, టూరిజం, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొంటారని ఆలయ ఈవో పి.కిషన్ రావు తెలిపారు. కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తున్నారు.

## బాలుడిపై అత్యాచారం చేసిన నిందితుడికి 20 సంవత్సరాల శిక్ష

**మల్లాపూర్, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామంలో 2019లో జరిగిన బాలుడిపై అత్యాచారం కేసులో నిందితుడు గోగుల సాయి కుమార్ కు జగిత్యాల ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి నీలిమ కేసు విచారణ చేపట్టి నిందితుడిని దోషిగా తేల్చి శిక్ష విధించారు. అంతే కాకుండా 20 వేల జరిమానా విధించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన అప్పటి మల్లాపూర్ ఎస్సై డి. పృథ్వీధర్, మెట్ పల్లి సిఐ ఎం రవి కుమార్ ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

# రవాణాశాఖ ద్వారా సులభతర సేవలు

- మార్కెట్ యార్డ్ ప్రాంతంలో రవాణాశాఖ విభాగం
- ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్




**పుట్టపర్తి,డిసెంబర్23 (నినాదం న్యూస్):** ప్రజలకు రవాణా శాఖ ద్వారా సేవలన్నీ సులభతరంగా అందించాలన్న ధ్యేయంతో ధర్మవరం మార్కెట్ యార్డ్ ప్రాంతంలో రవాణా శాఖ విభాగంను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం వైద్య విద్య శాఖల మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ధర్మవరం మార్కెట్ యార్డులో రవాణా శాఖ ఏర్పాటుచేసిన ఆ÷-లన్‌న్ సేవలను మంత్రి ప్రారంభించారు. జిల్లా రవాణా శాఖ అధికారి కరుణాసాగర్, కదిరి ఎం .వి.ఐ వరప్రసాద్ , ధర్మవరం ఎం.వి.ఐ రాణి, ఆర్డీవో మహేష్ ధర్మవరం తెలుగుదేశం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ , రాష్ట్ర జనసేన నాయకులు చిలక మధుసూదన్ రెడ్డి , ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, పలువురు ప్రజా ప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాహనాల కు సంబంధించి లైసెన్సు, రిజిస్ట్రేషన్, ఎల్ ఎల్ ఆర్, ఫిట్నెస్, పర్మిట్లు మంజూరు తదితర సర్టిఫికెట్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గతంలో ప్రజలు రవాణా శాఖ ద్వారా సేవలు పొందాలంటే హిందూపురం ,అనంతపురం, కదిరి ప్రాంతాలకు వెళ్లే వారిని ప్రస్తుతం 90 కిలోమీటర్ల వరకు ప్రయాణించే శ్రమను తగ్గించి ప్రస్తుతం తాత్కాలికంగా రవాణా శాఖ కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర గౌరవం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి , రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సహకారాలతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు అవసరమైన మేరకు రవాణా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు కనీస అవసరాలు కూడా తీర్చలేదని కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల కాలంలో అనేక పరిపాలన నిర్మాణాత్మకమైన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నదని మంత్రి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో శాశ్వత రవాణా శాఖ కార్యాలయం ఏర్పాటు చేయుటకు ఆర్డిఓ మరియు రవాణా శాఖ అధికారి ద్వారా భూసేకరణకు సంబంధించి ప్రతిపాదన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో కొన్ని దశాబ్దాల కాలంగా రవాణా శాఖ కార్యాలయం లేని కారణంగా ప్రజల సమస్యలను గుర్తించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి, తాడిమర్రి ధర్మవరం పట్టణంతోపాటు రాప్తాడు నియోజకవర్గం లోని రామగిరి, సి.కే.పల్లి, కనగానపల్లి మండల ప్రజానీకానికి కూడా ప్రమాణ శాఖ సేవలు అందించడం జరుగుతుందన్నారు. అందువల్ల ఈ ఆరు మండలాలకు సంబంధించిన ప్రజలు ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. అంతేగాక చెరువులకు నీరు పటలకు సాగునీరు జలజీవన్ మిషన్ పనులు తదితర కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మరి ముఖ్యంగా పట్టణ గ్రామాలలో గుంతలు లేకుండా రహదారుల నిర్మాణం కోసం సుమారు రూ.26 వేల కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి నీరు అందించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని సుమారు రూ. 70 వేల కోట్ల రూపాయల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో పెట్రోల్ ,డీజిల్ ఆదా చేసే క్రమంలో ఎలక్ట్రానిక్ వాహనాలు కూడా ప్రభుత్వం ద్వారా వాడుకలో రానున్నాయని మంత్రి తెలిపారు.

# రోడ్డు నాణ్యతను పరిశీలించిన పవన్

- 44 గ్రామాల మంచినీటి పనులకు మరమ్మత్తులు
- కృష్ణా జిల్లాలో పలు పనులకు శంకుస్థాపన



**విజయవాడ,డిసెంబర్23 (నినాదం న్యూస్):** కంకిపాడు మండలంలోని గొడవర్రు గ్రామంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోమవారం పర్యటించారు. రూ.3.5 కోట్ల వ్యయంతో శరవేగంగా జరుగుతున్న గొడవర్రు -రొయ్యూరు రోడ్డు పనులను పవన్ పరిశీలించారు. ఇటీవల కంకిపాడులో జరిగిన బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ విజ్ఞప్తి మేరకు అధ్వాన్నంగా ఉన్న రొయ్యూరు రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలంటూ పవన్ ఆదేశాలు జారీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు పనులు తుదిదశకు చేరుకోవడంతో పవన్ పరిశీలించారు. స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఇకపోతే జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. గుడివాడ నియోజకవర్గం పరిధిలోని మల్లాయపాలెం గ్రామంలో పర్యటించారు. గ్రామీణ రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న నీటిని పరిశీలించారు. గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో గుడివాడ నియోజకవర్గం పరిధిలోని 44 గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరా వ్యవస్థకు మరమ్మత్తులు చేపట్టారు. గ్రామీణ ప్రాంతంలో నీటి సరఫరా సరిగా లేదన్న విషయం పల్లె పండుగ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ దృష్టికి గుడివాడ శాసనసభ్యుడు వెనిగండ్ల రాము తీసుకురాగా... రూ. 3.8 కోట్ల నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఫిల్టర్ బెడ్లు పూర్తిగా దెబ్బ తినడంతో పంచాయతీకి రూ. 4 లక్షల ఖర్చు చేసి ఫిల్టర్ బెడ్లు మార్పు చేశారు. 14 గ్రామాల పరిధిలో ఫిల్టర్ బెడ్ల మార్పు ప్రక్రియ పూర్తి అయిన క్రమంలో సోమవారం శ్రీ పవన్ కళ్యాణ్ గారు మల్లాయపాలెం రక్షిత మంచి నీటి సరఫరా కేంద్రం వద్ద క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. స్టోరేజ్ ట్యాంక్, ఫిల్టర్ బెడ్లతోపాటు– 14 గ్రామాల్లో మరమ్మతులకు ముందు, తర్వాత నీటి నమూనాలను పరిశీలించారు. క్షేత్ర స్థాయి పరిశీలన నిమిత్తం గుడివాడ నియోజకవర్గానికి వచ్చిన పవన్ కళ్యాణ్ కి స్థానిక శాసనసభ్యులు వెనిగండ్ల రాము ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గారు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వర రావు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ , జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.గుడివాడలో జనసేన, బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు.

# దృశ్యం సినిమా సీన్ రిపీట్...

**-సినీ పక్కీలో ఘటన**
**-ఖననం చేసిన మృతదేహానికి ఏడాది తర్వాత రీ పోస్టుమార్టం**
**-కనిపెంచిన మమకారం ఆ తల్లిదండ్రులను హంతకులుగామార్చే**



**కోదాడ, డిసెంబర్ 23 (నినాదం న్యూస్) :** కోదాడలో దృశ్యం సినిమా సీన్ రిపీట్ అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సినీ పక్కీలో ఘటన జరగడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురైనారు. గత సంవత్సరంలో ఖననం చేసిన మృతదేహాన్ని కొమరబండ సమీపంలో రీపోస్టుమార్టం నిర్వహించారు. సినిమాలో జరిగిన విధంగా ఓ బాలిక తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని బాలిక కుటుంబ సభ్యులు హత్య చేసిన ఘటన ఏవిధంగా చోటు చేసుకుందో అదే ఘటన కోదాడలో చోటు చేసుకోవడంతో ఒక్కసారిగా పట్టణ వాసులు భయభ్రాంతులకు గురైనారు. అసలు విషయం ఏమిటంటే పట్టణ పరిధిలోని బాలాజీనగర్ సమీపంలోని ఆర్కే మేజర్ కాల్వలో 20 నెలల క్రితం ఓ మృత దేహం కొట్టుకొని రావడంతో పట్టణ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిదిగా కేసు నమోదు చేసి కోమరబండ శివారులోని చెరువు సమీపంలో ఖననం చేశారు. కాగా, శుక్రవారం ఆ మృతదేహాన్ని తిరిగి బయటకు తీసి రీపోస్ట్ మార్టం నిర్వహించారు. చనిపోయిన వ్యక్తిది హైదరాబాద్ కావడంతో అతని బంధువుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అక్కడి పోలీసులు.. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం వెలుగు లోకి వచ్చింది. మృతుడు హైదరాబాద్లోని బోరబండకు చెందిన వివాహితుడు కుమార్ (35) ఓ బాలికను ట్రాప్ చేసి అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో ఆమె తల్లిదండ్రులు, బంధువులు దాడి చేశారు. ఈ దాడిలో కుమార్ మృతిచెందడంతో నిందితులు మృతదేహాన్ని మునగాల మేజర్ కాల్వలో వదిలి వెళ్లారు. నీటి ప్రవాహానికి బాలాజీ నగర్ కాల్వలోకి కొట్టుకు రావడంతో పట్టణ పోలీసులు ఖననం చేశారు. విషయం తెలియడంతో తిరిగి రీపోస్ట్మార్టం నిర్వహించారు.సినీ కథలో జరగాల్సిన సంఘటనలు నిజజీవితంలో జరగడంతో ఒకింత ఆందోళన గురైనరు.

**అసలేం జరిగింది...**
హైదరాబాద్లోని నిజాంపేట్ కు చెందిన ఆటో డ్రైవర్ ఓ కుమార్ (30) ప్రేమ వివాహం చేసుకొన్నారు. ఏపీలోని కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన ఓ కారు డ్రైవర్ తన భార్య, కూతురుతో కలిసి జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్నారు. ఏడో తరగతి " చదువుతున్న కారు డ్రైవర్ కూతురును ఆటో డ్రైవర్ కుమార్ ట్రాప్ చేసి తీసుకెళ్లి యూసఫ్గూడలోని ఓ గదిలో నిర్బంధం చాడు. లైంగికదాడికి యత్నించగా ఆ బాలిక తప్పించుకొని వెళ్లింది. బాలానగర్ పోలీసు లకు కనిపించిన ఆ బాలికను విచారిస్తే తాను అనాథనని చెప్పడంతో వారు నింబోలిఅడ్డ లోని హోంకు తరలించారు, ఈ సమ యంలో ఆ బాలిక కోసం ఆమె తల్లిదం డ్రులు వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈలోగా కరోనా సమయంలో ఆ బాలికకు ఇప్పించిన ల్యాప్టాప్ ను పరిశీలించగా, స్నాప్ చాట్ లో ఉన్న ఓ ఫోన్ నంబర్ను గుర్తించగా, అది కుమారిది అని తెలిసింది. కుమార్ అనే యువకుడే తన కూతురును కిడ్నాప్ చేశాడని ఆ తల్లిదం డ్రులు భావించారు. దీంతో ఆ బాలిక తల్లి స్నాప్ చాట్లో ఓ ఐడీని క్రియేట్ చేశారు. ఆమె హనీట్రాప్ చేసి ఆ యువకుడిని మియాపూర్ రప్పించింది. దీంతో బాలిక తల్లిదండ్రులు కుమార్ను పట్టు కొని కొట్టి కారులో కిడ్నాప్ చేశారు. నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి తన కూతురు సమాచారం చెప్పాలని నిలదీశారు. తన నుంచి తప్పించుకోపోయిన విషయాన్ని చెప్పాడు. దీంతో వారి దెబ్బలకు తాళలేక ఆ యువకుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో కారులో సూర్యాపేట వైపు తీసుకెళ్లి పెద్ద బండరాయిని కాళ్లు, చేతులకు కట్టిపడేసి నాగార్జున సాగర్ ఎడమ కాల్వలోకి సజీవంగానే తోసేశారు. దీంతో బొరబండ పోలీస్ స్టేషన్లో కుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఆ తర్వాత కారు డ్రైవర్ కూతురు తల్లిదండ్రుల వద్దకు చేరుకున్నది. అయితే కుమార్ ఆటోను ఆ కారు డ్రైవర్ వాడుతుండగా, కుమార్ బంధువులు ఆటో బంపర్ ను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసులో కీలక మలుపు తిరిగింది. సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసుల ద్వారా గుర్తు తెలియని డెడ్ బాడీ డీఎన్ఏ కోసం ఎముకలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్ కు తరలించారు. ఆటో డ్రైవర్ హత్యోదంతంలో బాలిక తల్లిదండ్రులపై కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సమాజానికి భారతదేశ చరిత్ర అత్యంత ఆవశకం



**చౌటుప్పల్ డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో భారత్ వికాస్ కొమరం భీమ్ శాఖ ఆధ్వర్యంలో "భారత్ కో జానో" కార్యక్రమంలో భాగంగా క్విజ్ పోటీలు కొమరం భీం బ్రాంచ్ శాఖ అధ్యక్షులు చీకురి వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొమరం భీమ్ బ్రాంచ్ సంస్కార్ కన్వీనర్ చినుకని యువరాజు క్విజ్ నిర్వాహకులుగా వ్యవహరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత్ వికాస్ పరిషత్ దక్షిణ ప్రాంతీయ సంయుక్త కార్యదర్శి పసుపులేటి నరేంద్ర కృష్ణ హాజరై మాట్లాడుతూ.... భారతదేశం గురించి నేటి విద్యార్థులలో తక్కువ పరిజ్ఞానం ఉందని అందుకే ప్రతి సంవత్సరం భారత్ కో జానో పేరుమీద విద్యార్థులలో దేశభక్తి భారత దేశ చరిత్ర అవగాహన పెంచడం కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. అనంతరం క్విజ్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ప్రధమ, ద్వితీయ, తృతీయ,కన్సోలేషన్, పార్టిసిపేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిలివేరు శ్రీనివాస్, కరస్పాండెంట్ సిలివేరు ధనలక్ష్మి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతే దేశానికి వెన్నెముక




**చౌటుప్పల్ డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వలిగొండ రోడ్డు నందుగల శ్రీ చైతన్య పాఠశాలలో అంతర్జాతీయ రైతుల దినోత్సవం పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను గౌరవిస్తూ రైతులకు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి గురువారావు హాజరై మాట్లాడుతూ....రైతు దేశానికి వెన్నెముకని అన్నారు.రైతు లేనిదే రాజ్యం లేదు భోజ్యం లేదని తెలిపారు.అనంతరం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సతీష్ మాట్లాడుతూ.... అందరి ఆకలి తీర్చడం కోసం నిస్వార్థంగా వ్యవసాయం చేస్తున్న రైతులే నిజమైన హీరోలని అన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఇన్చార్జ్ వెంకట్ రెడ్డి, కోఆర్డినేటర్ రఘువంశీ, ప్రిన్సిపల్ శ్వేత, డీన్ దుర్గాప్రసాద్, ఏవో గోపి తదితరులు పాల్గొన్నారు.

# రెబ్బదేవ్ పల్లెలో మహిళా గ్రూపు సిఏ చేతివాటం

**-కిస్తీడబ్బులువాడుకున్న వైనం**
**-చేతులు మారుతున్న లక్షల రూపాయలు**
**-నిజాలు బయటపడ్డ చర్యలు శూన్యం**
**-రెబ్బల్ దేవ్ పల్లెలో బయటపడ్డ మహిళా సంఘాల్లో కుంభకోణం?**



**సుల్తానాబాద్, డిసెంబర్ 23 (నినాదం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో అ భివృద్ధి చేయాలని సంకల్పంతో మహిళా సంఘా ల ద్వారా వడ్డీ లేని రుణం అందజేస్తూ , ఆర్థికంగా ఆదుకోవడానికి కోట్లాది రూపాయలు ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కొంతమంది మహిళల అమా యకత్వాన్ని సిఏలు ఆసరా చేసుకుని నిలువనా ముంచేస్తున్నారు. సుల్తానాబాద్ మండలం రెబ్బ ల్ దేవ్ పల్లె గ్రామంలో దాదాపుపదిలక్షలరూపా యలు మహిళా సంఘాల డబ్బులు వాడుకున్న వైనం వెలుగులోకి వచ్చింది. ప్రతి నెల బ్యాంకు లో జమ చేయాల్సిన రూపాయలనువాడుకుంటూ అడ్డం గా దొరికింది. సోమవారం సుల్తానాబాద్ మండలం రెబ్బల్దేవ్ పల్లి గ్రామంలో ఇలాంటి సం ఘటన పునారవతమైంది. రెబల్దేవ్ పల్లి గ్రామానికి చెందిన 10 మహిళా సంఘాల చెందిన మహిళలు తమకు అన్యా యం జరిగిందని, తమ డబ్బులు కాజేసిన సి ఎ పై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ మెట్లుఎక్కారు.

**అధికారుల నిర్లక్ష్యం.. మహిళలకు శాపం....**
మహిళలకు వడ్డీలేని రుణాల కార్యక్రమంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామీణ ప్రాంత మహిళలు మోసపోతున్నారు. కేవలం మహిళా సంఘాల గ్రూపుల సి ఎ లను నమ్మి లక్షలాది రూపాయలు బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సిన రూపాయలు తమ సొంతానికి వా డుకున్న వారిపై చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆ రోపిస్తున్నారు. బ్యాంకర్లు సంఘం డబ్బులు రా వడంలేదని సమాచారం ఇస్తే తెలియడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి: ప్రిన్సిపల్ వి. వెంకటేశులు



**సూర్యాపేట డిసెంబర్ 23 (నినాదం న్యూస్) :** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ వి. వెంకటేషులు అన్నారు. సోమవారం భానుపురి ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... విద్యార్థి దశ నుండే క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని తెలిపారు. అనంతరం టాస్ వేసి ఇరుజట్లను ఆహ్వానించారు. అనంతరం ఆర్గనైజర్లు ఆయనను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు గుండెపురి సతీష్ గాదే శ్రీకాంత్, క్రీడాకారులు రాపర్తి రమేష్, డీజే కిరణ్, చింత సుధీర్, దేవా, మణి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



**చౌటుప్పల్ డిసెంబర్ 23(నినాదం న్యూస్ ) :** ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి పంతంగి గ్రామంలో గత నాలుగు రోజుల నుండి సర్వే నిర్వహిస్తున్నటువంటి గ్రామ కార్యదర్శి స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు కి సిపిఎం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న అధికారుల దగ్గరికి వెళ్లి పార్టీలకు అతీతంగా అర్హులైన ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఎం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి, మండల కమిటీ సభ్యుడు బోయ యాదయ్య, గ్రామ శాఖ కార్యదర్శి రత్నం శ్రీకాంత్, సబ్ శాఖ కార్యదర్శి నేరడి మహేష్ మహిళా శాఖ కార్యదర్శి రోడ్డ సోని, గ్రామ కమిటీ సభ్యులు బోయ మధు, మీసాల లింగయ్య, నక్క లింగస్వామి, సిద్ధగొని శ్రీకాంత్, సభ్యులు బోయ సాయి కిరణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# 108 అబులెన్స్ వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్



**చింతపల్లి, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 108 అబులెన్స్ వాహనాన్ని స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర చికిత్స కోసం గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా 108 వాహన సేవలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గతంలో ఉన్న వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతనంగా వాహనాలను ఆసుపత్రులకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీదేవి,మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్,వైస్ ఎంపీపీ యాదయ్య గౌడ్,మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం,జిల్లా అధికార ప్రతినిధి ముచర్ల యాదగిరి,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్, పిఎసిఎస్ చైర్మన్ వెంకటయ్య,మాజీ ఎంపీటీసీలు వెంకట్ నర్సింహా రెడ్డి,కాసారపు శ్రీను,నర్సింహా, మాజి కో ఆప్షన్ సభ్యులు రియాజ్ పాషా, జహంగీర్,మాజి సర్పంచ్ జితేందర్ రెడ్డి,గుండ్ల పల్లి నర్సింహా రెడ్డి, పుల్సింగ్,పురుషోత్తం రెడ్డి,రాములు, కోశాధికారి కొండల్ యాదవ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు శేఖర్ గౌడ్,కట్ట మహేష్ ,దాసరి రాజు, భైకం రాములు,మెండ వెంకటయ్య,శేఖర్,గోవింద్ రవి పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ డిఎం

**చింతపల్లి, డిసెంబర్ 23 (నినాదం న్యూస్)** దేవరకొండ బస్ డిపో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సుల రాకపోకలకు సంబంధించి ప్రజాభిప్రాయాలను సేకరించడానికి నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. దేవరకొండ డిపో పరిధిలో, ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సూచనలు ,సలహాలు లేదా ఏవైనా సమస్యలను తెలియజేయడానికి కింద సూచించిన ఫోన్ నెంబర్ కు 9959226 311 డయల్ చేయాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, ప్రజలు, సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

# ముగిసిన జిల్లా స్థాయి సీఎం కప్ సైక్లింగ్ క్రీడా పోటీలు

**-సైక్లింగ్ క్రీడా పోటీలలో విశేష ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన అంబిటస్ ది స్కూల్ విద్యార్థులు**

**-చైర్మన్ కుంచారం జైపాల్ రెడ్డి**



**చౌటుప్పల్ డిసెంబర్ 23(నినాదం న్యూస్ ):** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, రంగారెడ్డి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా స్థాయి సీఎం కప్ సైక్లింగ్ పోటీలను రంగారెడ్డి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఈ నెల 21న తుక్కుగూడలో 300 మంది సైక్లిస్టులతో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం లోని అంబిటస్ ది స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. విజేతగా నిలిచిన విద్యార్థులను చైర్మన్ కుంచారం జైపాల్ రెడ్డి అభినందించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర సైకిల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ సెక్రెటరీ మల్లారెడ్డి పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పోటీలలో విజేతలుగా నిలిచినవారు ఈ నెల 27, 28, 29 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి సీఎం కప్ సైక్లింగ్ పోటీలకు ఎంపిక అవతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ చైర్ పర్సన్ హేమలత రాజు గౌడ్, మౌంట్ ఎల్లి పబ్లిక్ స్కూల్, అంబిటస్ ది స్కూల్ చైర్మన్ కుంచారం జైపాల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా పిడి భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్స్ రాజు, భావన సుధాకర్, రంగారెడ్డి జిల్లా సైకిల్ అసోసియేషన్ సెక్రెటరీ రమేష్, ఆర్టీసీ బర్కత్ పుర డిపో మేనేజర్ మంజుల, వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు చిత్తరంజన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమ భావన సంఘం వివో ఏ పై విచారణ

**కోదాడ/అనంతగిరి, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** అనంతగిరి మండల కేంద్రంలోని సమ భావన సంఘం-1 లో వివో ఏ గా విధులు నిర్వర్తిస్తున్న గరిడేపల్లి శ్రీనివాసరావు అక్రమాలకు పాల్పడుతున్నారని, వివో ఏ గా మహిళ ఉండవలసిన స్థానంలో పురుషుడు ఉండడంపై అభ్యంతరం తెలుపుతూ స్థానిక సంఘం సభ్యులు పలువురు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఫిర్యాదు నిమిత్తం సోమవారం డిపిఎం లక్ష్మీనారాయణ సమ భావన సంఘం కార్యాలయంలో సంఘ బంధం లీడర్లతో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా పలువురు సంఘ బంధం లీడర్లు అక్రమాలకు పాల్పడుతున్న శ్రీనివాసరావుని తొలగించి, వివో ఎగా మహిళ కు అవకాశం ఇవ్వాలని ప్రస్తావించినట్లుగా తెలుస్తుంది. విచారణ కు సంబంధించిన రిపోర్టును జిల్లా అధికారులకు అందజేయనున్నట్లుగా తెలిపారు... ఇదిలా ఉండగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వివోఏ శ్రీనివాస్ సంఘ బంధం లీడర్లతో తనకు అనుకూలంగా చెప్పేలా ముందుగానే డబ్బులు ముట్ట చెప్పి తప్పుడు సమాచారం చెప్పించారని, విచారణ కూడా తూతు మంత్రంగా ముగించారని ఫిర్యాదు చేసిన సంఘం సభ్యులు ఆరోపించారు.

# ధన్వితను అభినందించిన జిల్లా కలెక్టర్ త్రిపాటి



**చింతపల్లి, డిసెంబర్ 23 ( నినాదం న్యూస్)** మండలంలోని వర్కాల గ్రామానికి చెందిన తిగుళ్ళ శివ, శ్రావణి దంపతుల ఎనిమిది నెలల చిరంజీవి ధన్విత నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సృష్టించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ త్రిపాటి సోమవారం చిరంజీవి ధన్విత ను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె చిరంజీవికి ప్రశంసా పత్రాలతో పాటు మెడల్ ను అందజేశారు."ధన్విత మెమరీ అద్వితీయత"శీర్షికన నవంబర్ 28వ తేదీన నినాదం పత్రికలో వార్త ప్రచురితమైంది. నాటి వార్తకు సంబంధించి చిరంజీవి తల్లిదండ్రులు శివ శ్రావణి లు తమ కూతురుకు లభించిన అవార్డు, పథకాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా తీసుకోవాలన్న కల నేడు నెరవేరడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ వింజమూరు రవి, గండికోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సంతోషంగా పుట్టింటికి వెళుతూ...





**కోదాడ/అనంతగిరి, డిసెంబర్ 23 (నినాదం న్యూస్):**సంతోషంగా తన పుట్టింటికి వెళ్లి తన కుటుం బం తో సంతోషంగా గడపా లని భర్తతో కలిసి వెళుతున్న ఆమెకు ట్రాక్టర్ రూపంలో ఊహించని మృతువు కబలించింది. ఈ విషాద సంఘటన అనంతగిరి మండలం ఖానాపురం గ్రామ శివారులోని అనంతగిరి -కోదాడ రహదారి మార్గమధ్యంలోని నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన రెడ్డి బోయిన మల్లయ్య, సరోజిని దంపతులు సరోజినీ తల్లి గారి స్వగ్రామమైన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్ గూడెం గ్రామానికి ఆటో మాట్లాడుకుని వెళుతున్న క్రమంలో అనంతగిరి మండలం ఖనాపురం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డీ కొట్టడంతో ఆటోలోని సరోజినీ (38) అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ కోట వీరబాబు కు తలకు తీవ్ర గాయాలు అయినాయి. మృతురాలి భర్త మల్లయ్య ఎలాంటి గాయాలు కాలేదు.

# గణిత ప్రదర్శనతో ఎంతో ప్రయోజనం



**చౌటుప్పల్ డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** గణిత పితామహుడు శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ మేరకు శ్రీ చైతన్య విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన గణిత ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనశాలను మండల విద్యాధికారి గురువారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రామానుజం పుట్టిన రోజును గణిత దినోత్సవం జరుపుకోవడం భారతీయులందరూ గర్వించదగ్గవిషయం అని, రామానుజం సేవలు గణితానికి ఆదర్శనీయం అని తెలిపారు. అతి చిన్న వయసులో గణితానికి అతను చేసిన సేవలు ఆదర్శనీయం అని కొనియాడారు..అనంతరం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సతీష్ మాట్లాడుతూ...రామానుజం మన భారతదేశంలో పుట్టి ప్రపంచమంతా గణితంతో తన ప్రతిభను చాటి మనకు భావితరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. విద్యార్థులు వివిధ గణిత రూపాలను, పజిల్స్, ద్వారా రామానుజన్ సేవలను ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రీజినల్ ఇన్చార్జ్ వెంకట్ రెడ్డి, కోఆర్డినేటర్ రఘు వంశీ, ప్రిన్సిపల్ శ్వేత, డీన్ దుర్గాప్రసాద్, ఏవో గోపి తదితరులు పాల్గొన్నారు.

# పీవీ సంస్కరణలు నేటికీ ఆదర్శం

## ఆర్థికంగా దేశాన్ని బతికించిన నాయకుడు పీవీ : రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



**భీమదేవరపల్లి డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో భారత రత్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి 20 వ వర్ధంతి సందర్భంగా వారి నివాస ప్రాంగణంలో సంస్మరణ సభ కార్యక్రమం ముఖ్య అతిథిగా హాజరైన రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న పీవీ నరసింహారావు గారి కూతురు ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్యే నాగరాజు , హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్చార్జి వోడితల ప్రణవ్ , పీవీ నరసింహారావు కుటుంబ సభ్యులు ,ఇతర ముఖ్య నేతలు.. పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా పీవీ నివాసంలో వారి విగ్రహానికి నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి పొన్నం ప్రభాకర్భారత రత్న వంగర ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు గారి వర్ధంతి సందర్భంగా ఈ సంస్మరణ సభ జరుగుతుంది పీవీ నరసింహారావు కూతురు వాణీ అక్క మాట్లాడుతుంటే భావోద్వేగానికి గురవుతున్న పీవీ నరసింహారావు కి సహచరులు చొక్కారవు గారితో కలిసి అనేక సార్లు పీవీ నరసింహారావు గారిని కలిసే అవకాశం వచ్చింది 1991 లో నేను ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పీవీ గారు ప్రధానిగా ఉన్నారు.. అప్పటి నుండి ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేది.. పీవీ నరసింహారావు ఈ వంగర ను ప్రపంచానికి చాటి చెప్పారు... వంగర హుస్నాబాద్ నియోజవర్గంలో ఉంది..హుస్నాబాద్ ను అన్ని రకాలుగా గౌరవాన్ని పెంపొందించేలా చేస్తున్న..పీవీ నరసింహారావు ఆయన చదివేది ఎక్కువ మాట్లాడడం తక్కువ..పీవీ నరసింహారావు ఆర్థికంగా ఈ దేశాన్ని బతికించిన వ్యక్తి..పెద్ద పెద్ద కార్లు సాంకేతిక విప్లవం మన దేశానికి వచ్చాయి అంటే కారణం వారే.. వంగర గ్రామానికి బ్రిడ్జి పై ఇప్పుడే అధికారులతో మాట్లాడ.. నిధులు కేటాయించి త్వరలోనే పూర్తి చేస్తం. ఎమ్మెల్సీ వాణి అక్క ను మా ఆఫీస్ కి రమ్మని చెప్పి ఆహ్వానించా.. ఈ సారి వర్ధంతి కార్యక్రమానికి వంగర రావాలని చెప్పాను..పీవీ కుమారుడు ప్రభాకర్ రావు కూడా వంగర గ్రామానికి వచ్చి కార్యక్రమాల్లో పాల్గొనాలి ఆహ్వానించా.. పీవీ నరసింహారావు కూతురు వారి కొడుకు గా ఈ గ్రామ ప్రేమ ఆప్యాయతలు వారికి జ్ఞాపకం ఉన్నాయి..వంగర మా సొంతం ..అని అక్క చెప్పడం సంతోషం..

**పీవీ స్మారకం పూర్తి చేస్తాం..** ఈ ప్రాంతంలో మంచి వాతావరణం ఉండేలా.. టెక్నాలజీ ,ఎడ్యుకేషన్ , రూరల్ డెవలప్మెంట్, సాంస్కృతిక శిక్షణ ఇక్కడ జరిగేలా పిసి నడయాడిన నేల దీనిని ఉపయోగిస్తే బాగుంటుంది.. నవోదయ విద్యాలయాలకు ఆద్యుడు పీవీ నరసింహారావు నవోదయ విద్యాలయాన్ని వంగర కి ఇవ్వాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేస్తున్నా.. హనుమకొండలో నవోదయ విద్యాలయాలు లేవు..ఇక్కడ స్థాపించాలని విజ్ఞప్తి చేస్తున్నా నవోదయ లు స్థాపించిన పీవీ నరసింహారావు స్వగ్రామం లో నవోదయ విద్యాలయాలకు స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం ఇక్కడ నవోదయ విద్యాలయం ఇవ్వాలి.. ఇప్పటికే కేంద్ర మంత్రులకు లేఖలు కూడా రాసం.. పీవీ నరసింహారావు చెరువు పై కూర్చొని ఆయన జ్ఞాన సంపద సాధించారు.. ఆ చెరువును కూడా అభివృద్ధి చేస్తం.. పీవీ గాలి తాకితే మరింత జ్ఞానాన్ని సాధించేలా చేస్తం.. పీవీ కుటుంబ సహకారంతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.. భారత రత్న ఈ ప్రాంతానికి రావడం చాలా పెద్ద గొప్ప .. ఆయన నడయాడిన నేల మీద మనం ఇక్కడ ఉండడం గర్వంగా ఉంది . ఆయన అనేక సంస్కరణకు తెచ్చారు .అనేక భాషలు మాట్లాడగలరు.

ఆయన స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా ఉండాలి.. వారు ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు కదులుతా. వారి జ్ఞాపకాలు ఎక్కడెక్కడ మిగిలిన పనులు ఉన్నాయో ముందుకు తీసుకుపోతా..



# టెక్నాలజీ అంటేనే పీవీ నరసింహారావు

## పీవీ వర్ధంతి సభలో పాల్గొన్న వొడితల ప్రణవ్





**భీమదేవరపల్లి డిసెంబర్ 23 (నినాదం న్యూస్):** మాజీ ప్రధాని భారతరత్న పీవీ నరసింహారావు గారి 20వ వర్ధంతి సందర్భంగా వంగరలో జరిగిన సంస్మరణ సభలో వోడితల ప్రణవ్ ,హుజు రాబాద్ కాంగ్రెస్ ఇన్చార్జి పీవీ నరసింహారావు గురించి మాట్లాడే వయసు గాని స్థాయి గాని లేదు.. నా వయసు కు పీవీ అంటే ఆర్థిక సంస్కరణలు తెచ్చిన మహనీయుడు.. మన చేతికి మొబైల్ ఫోన్ లు ,మనం తిరిగే కార్లు మన దేశానికి వచ్చినయంటే పీవీ నేకారణం మా తరానికి టెక్నాలజీ అంటే పీవీ పీవీ అంటే సాహిత్యం , కంప్యూటర్ ఆ కాలంలోనే వారు కంప్యూటర్ ప్రోగ్రాం గురించి చర్చించే వారు మా కుటుంబానికి పీవీ గాడ్ ఫాదర్ ఇక్కడ నిల్చొని హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి గా ఉన్నానంటే పీవీనే కారణం మా తాత వోడితల రాజేశ్వర రావు పీవీ తో సన్నిహిత సంబంధం ఉండేది చిన్నప్పటి నుండి పీవీ గురించి చర్చించి రోజు లేదు ఎన్నో విషయాలు గొప్ప గొప్ప అనుభావాలు చెప్పేవారు ఒక లెటర్ రాయడ ప్రారంభిస్తే ముగిసే వరకు పెన్ను కూడా ఆయన తీసే వారు కాదు ఆయన గురించి ఎన్నో కథనాలు వినుకుంటూ పెరిగాను.. ఈ గ్రామానికి వచ్చి వారి కార్యక్రమంలో పాల్గొనడం గర్వంగా ఉంది..

# విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళన..

## దండం పెడతాం పాఠాలు చెప్పించండి



సమగ్ర శిక్షా అభియాన్, కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేజీబీవీల్లో చదివే విద్యార్థినుల తల్లిదండ్రులు సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పరీక్షలు సమీపిస్తున్నందున ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. – రఘునాథపాలెం

పక్షం రోజులు దాటినా చదువులు సాగడం లేదంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ కేజీబీవీ ఎదుట సోమవారం విద్యార్థినులు వినూత్న నిరసన తెలిపారు. ఉపాధ్యాయుల సమ్మెలో ఉండటంతో బోధించే వారు లేక ఇబ్బంది పడుతున్నట్టు దండం పెడుతూ ఆవేదన వ్యక్తంచేశారు. – చంద్రుగొండ

సమగ్ర శిక్షా ఉద్యోగుల భిక్షాటన సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెలో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

# క్రిస్మస్ సెలవులివ్వండి.. గురుకుల విద్యార్థులు, తల్లిదండ్రుల డిమాండ్

**హైదరాబాద్:** ప్రతి సంవత్సరం ఇచ్చిన విధంగానే ఈ ఏడాది కూడా 3 రోజులు క్రిస్మస్ సెలవులి వ్వాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీకి చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది సెలవులను ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని సొసైటీలో ప్రతి సంవత్సరం 24,25,26న సెలవులు ఇచ్చేవారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఆదేశాలు జారీ చేయలేదు. విద్యార్థులను ఇళ్లకు పంపకపోవడంతో ఉపాధ్యాయులతో తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగుతున్నారు. తమకు అతిపెద్ద పండుగ క్రిస్మస్ అని, దానికి కూడా విద్యార్థులను పంపకపోతే ఎలా అని మండిపడుతున్నారు.



# చట్టసభల భేటీ కాలం తగ్గిపోతుంది..

ఆగ్లేయులు మనకు అధికార పాలన పగ్గాలు అప్పగించినంత మాత్రాన స్వతంత్ర భారతం ఆవిష్కృతమైనట్లు కాదు.మన ప్రజా పాలనలో అధికార దుర్వినియోగాన్ని ఎదిరించగలిగే శక్తిని ప్రజానీకం సముపార్జించుకున్న నాడే నిజమైన స్వరాజ్యం సిద్ధిస్తుంది. ప్రజలు ప్రభుత్వాలను ప్రశ్నించాలి. వాటి ఆగడాలను నిరసించాలి, అధికారమనే మత్తులో పాలకులు పెడతోవలు పట్టకుండా ప్రజలే చూసుకోవాలి. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు పారదర్శకంగా పనిచేయాలి.చట్టసభల ద్వారా ప్రజలకు అవి జవాబుదారీ కావాలి. అంటే, పాలకులు ఏ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ప్రజలకు తెలియాలి. సర్కారీ విధానాలు వెనుక వాస్తవాలు ఏంటో జనాలకు అవగతం కావాలి. “పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చట్టసభలు ప్రజావాణినివినిపించాలి”. ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా పాలిస్తుందో లేదో కనిపెట్టుకొని ఉండాల్సింది పార్లమెంటే. మన పార్లమెంటు శీతాకాల సమావేశాలు నవంబర్ 25న ప్రారంభమైనవి, మొత్తం 26 రోజులకు గాను లోకసభలో 20 రోజులు, రాజ్యసభలో 19 రోజులు కార్యాకలాపాలు జరిగాయి. లోకసభలో 54.5శాతం,రాజ్య సభలో 40 శాతం ఉత్పాదకత జరిగింది. కొత్తగా ఐదు బిల్లులను లోకసభ ప్రవేశపెట్టగా లోకసభలో నాలుగు, రాజ్యసభలో మూడు బిల్లులు ఆమోదం పొందాయి. 75 ఏళ్ల రాజ్యాంగం పై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. దీనిపై చర్చలు జరిగాయి.లోకసభలో 15.43 గంటలు చర్చలో62 మంది ఎంపీలు పాల్గొన్నారు.రాజ్య సభలో 17.41 గంటల పాటు జరిగిన చర్చలో 80 మంది సభ్యులు పాల్గొన్నారు.అధికార విపక్షాలు రాజ్యాంగ బద్ధ పాలన విస్మరించింది మీరంటే! కాదు మీరే అనివాదులాడారు. పై చర్చకు లోకసభలోప్రధానమంత్రి ,రాజ్యసభలో అమిత్ షా చర్చలకు సమాదానం ఇచ్చిన సందర్భంలో డా: బీ ఆర్ అంబేద్కర్ ను అవమానించాడని తీవ్ర దుమారం రేగింది. అలాగే వివాదాస్పద జమిలి ఎన్నికల బిల్లు (ఒక దేశం ఒకే ఎన్నికకు) సంబంధించిన రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు 39 మందితో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)వేశారు. ప్రజాసమస్యలపై చర్చ లేకుండానే.. లోకసభలో20,రాజ్యసభ19 రోజులు కార్యాకలాపాలు జరిగాయి. రెండిటిలోనూ కలిపి కొత్తగా ఏడు బిల్లులు ఆమోదంపొందగ, వాయిదాలు అంతరాయాలతో విలువైన ప్రజా కాలం వృధా అయ్యింది. ప్రజాసమస్యలు చర్చించాల్సిన చోట రణరంగంగా మారింది. ప్రజాస్వామ్య దేశంలో చట్టసభలను దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయాల అంటూనే కదనరంగంగా మార్చుచున్నారు. భరత జాతి తలరాతాలు మార్చాల్సిన అత్యున్నత విధాన నిర్ణీతలే వ్యక్తిగత విమర్శలు,ద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజల విలువైన కాలాన్ని వృధా చేస్తున్నారు. తమను తాము పరిపాలించుకోవాలన్న ప్రజాభిష్టంలోంచి ఊపిరి పోసుకున్నదే ప్రజాస్వామ్యం, అది మేడిపండు చందం కాకూడదు. ప్రజాప్రతి నిధులుగా చట్టసభల సభ్యులందరూ శాసన నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలి. కానీ ప్రభుత్వ ప్రతిపాదిత బిల్లుల్లో అనేకం నిమిషాల వ్యవధిలో సభామోదం పొందుతున్నాయి. అధికారపక్షం పట్టు విడుపులు ప్రదర్శిస్తూ ప్రతిపక్ష స్వరాలను ఆలకించాలి. సర్కారును వ్యతిరేకించడమే పనిగా సభలను స్తంభింప చేయకుండా అర్థవంతమైన విమర్శలకు విపక్షాలు కట్టుబడాలి.అప్పుడే ప్రజాప్రయోజనాలుకు రక్షణ రేఖగా పార్లమెంటు ప్రతిష్ట ఇనుమడిస్తుంది. మన స్వాతంత్ర్య సముపార్జనకు సార్థకత మవుతుంది. ప్రజాస్వామ్య పాలనలో ప్రభుత్వ పనితీరును నిశితంగా పరిశీలించడం, శాసనాలను రూపొందించడం, చట్టసభల ప్రధాన కర్తవ్యం. ప్రజా సమస్యలపై లోతుగా చర్చించడంతో పాటు వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించడం చట్టసభల సభ్యుల ముఖ్య బాధ్యత. ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులను కూలకుశంగా పరిశీలించి, చర్చించి వాటిలో తప్పొప్పులను గుర్తించాల్సిందీ ప్రజా ప్రతినిధులే. అస్పష్టమైన రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైన నిబంధన లేవి చట్టసభల్లోకి జొరపడకుండా చూడాల్సింది వారే.ఆ మేరకు బాధ్యతల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు విజయవంతం కావాలంటే? ముందు చట్టసభలు ఎక్కువ రోజులపాటు సమావేశం కావాలి.కానీ పార్లమెంటు తో పాటు రాష్ట్రాల శాసనసభలు భేటి అయ్యే రోజుల సంఖ్య క్రమంగా తగ్గిపోతుంది. మన రాష్ట్ర శాసనసభ 7 రోజులు.. 37 గంటలు, శాసనమండలి 25 గంటల పాటు కార్యకలాపాలు. మొత్తం ఎనిమిది బిల్లులకు ఆమోదం, నిరవధిక వాయిదా. నిరసనతో మొదలై నిమ్మలంగా ముగిసింది.తొలిలోకసభ(1952–57) సగటున ఏడాదికి 175 రోజులు పాటు భేటీ అయింది. 17వ,లోకసభ(2019–24)కు వచ్చేసరికి ఆ సంఖ్య 55కు పడిపోయింది. లిఆయా లోకసభలు ఏడాదికి సగటున ఎన్ని రోజులు పాటు భేటీ అయ్యాయంటే..1వ, లోకసభ–135రోజులు/. 2వ,116/.3వ,117/. 4వ,123/. 5వ,105/.6వ,110./7వ,93/.8వ,99/.9వ,85/.10వ,86/./11వ, 80/.12వ,78/.13వ,82/.14వ,66/.15వ,71/.16వ,66/.17వ,55/.రోజులుమాత్రమే జరిగినయి. ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా ప్రయోజనాలు ప్రజా ఆకాంక్షల మేరకు అర్థవంతమైన చర్చలే ప్రజాస్వామ్యానికి బలిమి.గత కొంత కాలంగా చట్టసభల్లో ప్రజా సమస్యల(చట్టాల)పై అర్థవంతమైన చర్చలు జరగడం లేదు.భేటీ వ్యవది తగ్గుతోంది.అంతే కాదు వ్యక్తిగత (పార్టీల) ప్రతిష్టపై ప్రజల విలువైన కాలాన్ని వృధా చేస్తున్నారు. అంతేకాదు ప్రజాధనానికి కాపలా దారులం అంటూనే తగ్గేదే లేదంటూ?లూటీ చేయడంలో పోటీ పడుతున్నారు.ఈ పెడదోరణలు ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమే!? ఇలానే ప్రజా ప్రయోజనాల, ప్రజా ఆకాంక్షల మేరకు చట్టాల తయారీలో విస్మరిస్తూ పోతే, నాటి స్వాతంత్ర్య సమరయోధుల బలిదానాలకు.. సమ సమాజ స్థాపన కోసం ఏర్పడిన రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలుగుతుంది. ఆర్థిక,రాజకీయ,సామాజిక,అంతరాలు పెరిగిపోతాయి. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమనే ఘన కీర్తికి భంగంకలుగుతోంది. ప్రజా ప్రయోజనాలు,ఆకాంక్షలు పరిరక్షించ బడిప్పుడే వారి త్యాగాలకు స్వార్థకత చేకూర్చిన వారవుతారు. రాబోవు తరం ముందు దోషులుగా నిలబడకండి. చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరపి అంతరాలు లేని సమాజాన్ని నెలకొల్పండి.

**– మేకిరి దామోదర్, సామాజిక విశ్లేషకులు, ఫోన్:9573666650**

# అపోలో 8 మిషన్ విశ్వాన్వేషణలో తొలి అడుగు

డిసెంబర్ 24, 1968, అంతరిక్ష పరిశోధనలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిన రోజు. ఆ రోజు, నాసా చేపట్టిన అపోలో 8 మిషన్ చంద్రుడి కక్ష్యలోకి చేరింది. ఇది మానవుల అంతరిక్ష పరిశోధనకు కీలక ఘట్టంగా నిలిచింది. అపోలో 8 మిషన్ ద్వారా మానవులు తొలిసారి చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించి, చంద్రుడి చుట్టూ పరిభ్రమించిన చరిత్ర సృష్టించారు అపోలో 8 మిషన్, అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చేపట్టిన అపోలో ప్రోగ్రామ్‌లో భాగంగా జరిగింది. 1968 డిసెంబర్ 21న, కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ మిషన్ ప్రారంభమైంది. వ్యోమగాములు ఫ్రాంక్ బోర్మన్, విలియం ఆండర్స్, జేమ్స్ లవెల్ చంద్రుడి కక్ష్యలోకి వెళ్లిన తొలి మానవులుగా నిలిచారు. డిసెంబర్ 24న అపోలో 8 చంద్రుడి కక్ష్యలో ప్రవేశించింది. వ్యోమగాములు చంద్రుడి చుట్టూ 10 సార్లు పరిభ్రమించారు. ఆ ప్రయాణంలో, వారు భూమి వైపు తిరిగి చూసి ప్రపంచానికి “ఎర్త్‌రైజ్” అనే ప్రసిద్ధ ఫొటో పంపారు. ఆ ఫోటో భూమిని చంద్రుడి నుండి ఆకాశంలో ఒక నీలి గోళంలా చూపిస్తుంది. ఇది భూమి అందాన్ని, పర్యావరణ పరిరక్షణను గుర్తుచేసే అత్యంత ప్రభావవంతమైన దృశ్యాల్లో ఒకటిగా నిలిచింది. డిసెంబర్ 24, 1968న అపోలో 8 నుంచి వ్యోమగాములు చందమామ నుంచి ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. ఈ ప్రసారంలో వారు బైబిల్లోని ఆదికాండం మొదటి అధ్యాయాన్ని చదివి, ప్రపంచ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇది చరిత్రలో అత్యధికంగా వీక్షించబడిన ప్రత్యక్ష ప్రసారముగా నిలిచింది. వారి సందేశం ప్రపంచ ప్రజలందరికీ శాంతి, సామరస్యానికి ప్రేరణ ఇచ్చింది. అపోలో 8 మిషన్, మానవుడు చంద్రుడిపై అడుగు పెట్టడానికి మార్గదర్శకమైంది. ఈ మిషన్ ద్వారా నాసాకు చంద్రుడి గురుత్వాకర్షణ, రేడియేషన్ స్థాయిలు వంటి అనేక ముఖ్యమైన సమాచారం లభించింది. అపోలో 8 మిషన్ విజయవంతమవడం, అంతరిక్ష పరిశోధనలో సాంకేతిక సామర్థ్యాలకు ప్రతీకగా నిలిచింది. చంద్రుడి కక్ష్యలో ప్రవేశించి సురక్షితంగా భూమికి తిరిగి రావడం మానవ ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. “ఎర్త్‌రైజ్” ఫొటో ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది. భూమి ప్రకృతి అందాలను కాపాడాల్సిన బాధ్యతను గుర్తు చేసింది. ఇది ఆపై పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకు



స్ఫూర్తిగా మారింది. మానవజాతి ఐక్యతకు సంకేతంగా మారి, ఈ మిషన్, మానవజాతి ఏకమై ఉన్నత లక్ష్యాలు సాధించగలదని ప్రపంచానికి సందేశం అందించింది. డిసెంబర్ 24, 1968, అంతరిక్ష పరిశోధన చరిత్రలో చిరస్మరణీయమైన రోజు. అపోలో 8 మిషన్ ద్వారా మానవజాతి తన శాస్త్ర, సాంకేతిక ప్రగతిని చాటింది. ఈ రోజు మానవుల ఆత్మవిశ్వాసాన్ని, భవిష్యత్తు శోధనలకు నాంది పలికింది. “ఎర్త్‌రైజ్” ఫొటో మన భూమి విలువను గుర్తుచేస్తూ, మనం సంరక్షించాల్సిన బాధ్యతను తెలియజేస్తుంది. అపోలో 8 మిషన్ మానవ చరిత్రలో శాశ్వతంగా నిలిచే ఒక అద్భుత విజయగాథ.

**– రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**